క్లుప్తంగా

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు తమ పెన్షన్ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు తీసుకొని రావాలన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: ఆశ వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారితోషికాల పేరుతో ఆశ వర్కర్లకు కనీస వేతనాలు లేక కుటుంబాలను పోషించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.18వేల వేతనం అమలు చేయాలని, ఏఎన్ఎం విద్యార్హత కలిగిన ఆశ వర్కర్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రజిని, రమ, లక్ష్మి, స్వర్ణలత, సభానా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ బీజేపీ' పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి జాదవ్ సచిన్, శంకర్, ప్రేమ్, దినేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేయాలి



మాట్లాడుతున్న ముక్తేశ్వర్

కెరమెరి: బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా వ్యాపారం కోసం తీసుకున్న రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయాలని ఐకేపీ ఏపీఎం ముక్తేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పంతో ఆసక్తి ఉన్న వారికి, మహిళా సంఘాలకు రుణాలు అందిస్తుందన్నారు. సీసీలు సంజీవ్, శ్యాంరావు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

ఆసిఫాబాద్‌రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ధర్మయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా వేరే వారికి ఇండ్లు ఇస్తున్నారని, ఇళ్లు లేని నిరుపేద వారికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

నార్నూర్: శ్రావణమాసం పురస్కరించుకొని గాదిగూడ మండలం తోయగూడ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గ్రామస్తులు మహాపూజ నిర్వహించారు. గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కలశంతో పాదయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ రాథోడ్ గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దారేమో ఇలా.. పొలాలకు వెళ్లేదెలా..?



రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సరైన దారి లేక అవస్థలు పడుతున్నారు. వర్షాలకు పొలాలకు వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారడంతో మోకాళ్ల లోతు బురదలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు

– రెబ్బెన

రహదారిపై డ్రెయినేజీ నీరు



జిల్లా కేంద్రంలోని బాలేశ్వర ఆలయానికి వెళ్లే పెద్దవాగు రహదారిపై డ్రెయినేజీ నీరు ప్రవహిస్తుండడంతో ఆలయానికి వెళ్లే భక్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై సీసీరోడ్ నిర్మించినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవడంతో మురికి నీరు రోడ్డుపైకి చేరి బురదమయంగా మారింది. శ్రావణమాసం నేపథ్యంలో ఆలయానికి వెళ్తున్న భక్తులు అవస్థలు పడుతున్నారు.

– ఆసిఫాబాద్

దారి కష్టాలు తీరేదెన్నడో..!



తిర్యాణి మండల కేంద్రం నుంచి మంగి, ముల్కలమంద, కౌటగాం, కైరిగూడ, టోక్కిగూడ, తాటిగూడ, ఎర్రబండ, కొలంగూడ, పటేల్‌గూడ తదితర గ్రామాలకు వెళ్లే ఏకైక రహదారి అధ్వానంగా మారడంతో మండల వాసులు తిప్పలు పడుతున్నారు. దట్టమైన అటవీప్రాంతంలో దాదాపు 6కిలో మీటర్ల మేర ఉన్న రోడ్డుపై ఎక్కువగా పెద్ద బండరాళ్లు ఉన్నాయి. వర్షాలకు గుట్టపై నుంచి నీరు కిందకి ప్రవహించి రోడ్డు పూర్తిగా కోతకు గురవుతోంది. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది.

– తిర్యాణి

బడి చదువులు.. భయం భయం

- శిథిలావస్థకు భవనాలు
- పట్టించుకోని విద్యాశాఖ
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య



శిథిలావస్థకు చేరిన ఇందాపూర్ పాఠశాల



దేవుడ్‌పల్లిలోని ఈ ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులు చదువుతున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. స్లాబ్ నుంచి వర్షం వస్తే ఉరుస్తుంది. గతేడాది అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో మరమ్మతుల పేరిటా రూ.30 వేలతో స్లాబ్‌పై నల్లటి షీట్లు వేశారు. 20ఏళ్ల వరకు కూడా మన్నికగా ఉంటుందని చెప్పారు. కానీ ఏడాది కూడా షీట్లు పనిచేయలేదు. వేసవికాలంలో గాలికి లేచిపోవడంతో బండరాళ్లను రక్షణగా పెట్టారు. దీంతో అక్కడి విద్యార్థులు భయంభయంగా చదువుకుంటున్నారు.

కెరమెరి: మండలంలోని పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయం భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఇందాపూర్‌లో 1 నుంచి 7వ తరగతి వరకు మొత్తం 84 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఏడు తరగతి గదులు ఉండాలి కానీ కేవలం మూడే ఉన్నాయి. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం వంద మందికి పైగా ఉండే విద్యార్థుల సంఖ్య సౌకర్యాల లేమితో ఈ ఏడాది కాస్త తగ్గింది. మంగళవారం గ్రామంలో వర్షం కురవడంతో పిల్లర్ల నుంచి నీటిధార వచ్చింది. ఈ నేపథ్యంలో ఎప్పుడు భవనం కూలుతుందోనని భయపడుతూ విద్యార్థులు చదువుకుంటున్నారు.



ఒకే గదిలో నిర్వహిస్తున్న రెండు తరగతులు

కూలిపోయేందుకు సిద్ధంగా..

30ఏళ్ల క్రితం నిర్మించిన ఇందాపూర్ పాఠశాల భవనం నేడు శిథిలావస్థకు చేరింది. గోడలు పగిలిపోయి పైకప్పు ఎప్పుడు కూలుతుందో అనే భయాందోళనలో విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక పక్క వర్షాకాలం, మరోపక్క శిథిలావస్థకు చేరిన భవనాలు ఈ రెండు కలిసి చిన్నారుల ప్రాణాలకు ముప్పు తప్పదనే భయంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి వెనుకాడుతున్నారు. బోధన సాగించాలంటే సరిపడా తరగతి గదులు లేక ఒకే గదిలో రెండేసి తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

భయంగా ఉంది..



ఇందాపూర్‌లో పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉంది. భారీ వర్షం కురిసినా.. పెద్ద గాలి వీచినా గోడలు పడిపోతాయేమోనని భయాందోళన చెందుతున్నాం. దీంతో పాఠాలపై ఏకాగ్రత పెట్టలేకపోతున్నాం. ఒకేగదిలో రెండేసి తరగతుల బోధనతో ఇబ్బందులు పడుతున్నాం.

– సందీప్, 7వ తరగతి

బడిని సందర్శించి.. గణితం బోధించి



విద్యార్థితో లెక్కలు చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిర్రకుంట ప్రభుత్వ పాఠశాలను మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సందర్శించారు. స్వయంగా గణితం బోధించారు. పలువురు విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. కట్టెల పొయ్యిపై నిర్వాహకులు వంటలు చేస్తుండగా ఇక నుంచి గ్యాస్‌పై వండాలని సూచించారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను మంగళవారం పరిశీలించారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట డీటీ శ్యాంలాల్, సిబ్బంది ఉన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం



దహెగాం: మాట్లాడుతున్న అనసూర్య



కెరమెరి: అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

దహెగాం: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ -3 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. డబ్బా పాలు పట్టడం మానుకోవాలని సూచించారు. ఏడో నెల నుంచి పోషకాలు ఉన్న ఆహారం తినిపించడం అలవాటు చేయాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పార్వతి, పద్మ, మమత, గర్భిణీలు, కిషోర బాలికలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పట్టిద్దాం..

కెరమెరి: బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టిద్దామని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. మంగళవారం మండలంలోని అనార్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2 బోగడగూడ కేంద్రాలతో కలిపి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రసవం తర్వాత తల్లికి వచ్చే మొదటి పాలను ముర్రుపాలుగా పరిగణిస్తారన్నారు. డబ్బా పాల జోలికి పోకుండా తల్లిపాలు తాగిస్తే శిశువు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, సరిత, సువర్ణ తదితరులు ఉన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం

ఆసిఫాబాద్‌అర్బన్: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్, బజార్‌వాడీ, పైకాజీనగర్, సందీప్‌నగర్ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



సరుకులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వెల్గి ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిసరాలు, వంట గది, స్టోర్‌రూం, వంట సరుకులు, మరుగుదొడ్లు, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఎవైనా ఉంటే వార్డెన్, హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం దామోదర్, సిబ్బంది ఉన్నారు.

ఎస్అండ్‌పీసీ సిబ్బందికి రవాణా సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వహించే ఎస్అండ్‌పీసీ సిబ్బందికి రవాణా సౌకర్యం కల్పించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. మంగళవారం ఎస్అండ్‌పీసీ సిబ్బంది సమస్యలపై ఏరియా జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏరియాలో బొగ్గు, డీజిల్ కుంభకోణాలు జరిగాయని, దాన్ని అరికట్టేందుకు యాజమాన్యం డీజిల్ లారీలకు ఎస్కార్ట్‌లు ఏర్పాటు చేయడంతో చోరీలు తగ్గాయన్నారు. ఇద్దరు సిబ్బంది పని చేయాల్సిన చోట ఒక్కరిని మాత్రమే ఏర్పాటు చేస్తుండటంతో పర్యవేక్షణ లేకుండా పోతోందన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్, ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూస్, హాస్పిటల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాయకులు కిష్టస్వామి, బాలేష్, రాజేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ సంజయ్‌కు సన్మానం



సంజయ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: రెబ్బెన నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సంజయ్‌ని మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. మాజీ జెడ్పీటీసీ సోమయ్య, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్, మాజీ సర్పంచ్ సోమశేఖర్, గంటుమేర, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాజుల రవీందర్, మాజీ ఎంపీటీసీ రఘుపతి, నాయకులు గోగర్ల రాజేశ్, మడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

రెబ్బెన సీఐ సంజయ్‌ను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఓదెలు, జిల్లా నాయకులు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

'భక్తిమార్గం అలవర్చుకోవాలి'

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఒక్కరు భక్తిమార్గం అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో హనుమాన్ ఆలయం వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రణయ్, సంతోష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన లోలెవల్ వంతెన



తెగిన లోలెవల్ వంతెన వద్ద గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: వర్షానికి మండలంలోని మాలన్ గొంది గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెన తెగిపోవడంతో మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గొండుగూడ, భవానినగర్, కోసారా, కోలాంగూడ, సెకన్‌గొంది, కుటుందా, మన్నాపూర్ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సంబంధింత అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు నిర్వహించి రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తిర్యాణి: ఈనెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుణవంత్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్మెడి కుర్సెంగ మోతిరాం, నాయకులు అర్జున్, గణపతి, శంకర్, చిన్ను ఉన్నారు.

బెజ్జూర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొడప విశ్వేశ్వర్, సర్‌మేడి శంకర్, గోండ్వాన సేవా సమితి రాయిసెంటర్ సర్‌మేడి మోతిరాం, బెజ్జూర్, పెంచికల్‌పేట మండలాల నాయకులు పాల్గొన్నారు.

హెల్త్‌సెంటర్‌ను కమ్మేసిన పిచ్చి మొక్కలు



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో పిచ్చి మొక్కలు పెరగడంతో అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ పరిశుభ్రత వాతావరణం కల్పించాలని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కాగజ్‌నగర్ సీహెచ్‌సీని సందర్శించిన సందర్భంగా అధికారులను ఆదేశించారు. అయినా వారిలో చలనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో మొక్కలు ఏపుగా పెరిగి ఆవరణ చిట్టడవిలా మారింది. చెట్లు విపరీతంగా పెరగడంతో దోమల బెడద అధికంగా ఉందని హెల్త్ సెంటర్ సిబ్బంది, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని వారు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్‌లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సందర్శనకు వచ్చిన డీఎంహెచ్‌వో సీతారాంను కలిశారు. వారు మాట్లాడుతూ రెబ్బెన పీహెచ్‌సీకి రోగుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. రాత్రి సమయంలో డాక్టర్ అందుబాటులో ఉండకపోవడంతో రోగులకు, రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సరైన వైద్యసేవలు అందడం లేదన్నారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని, ఇద్దరు డాక్టర్లను కేటాయించి సిబ్బందిని పెంచాలని కోరారు. కాంగ్రెస్ నాయకురాలు కుసుమ విజయ పాల్గొన్నారు.